


వంకాయ, బీరకాయ, బెండకాయ లాంటి రెగ్యులర్‌గా వినియోగించే కూరగాయల ధరలు సగటున కిలోకు రూ.40 చొప్పున ఉండేవి. ఇప్పుడు రూ.20-రూ.30 చొప్పున అదనంగా ధరలు పలుకుతున్నాయి. దీంతో వినియోగదారులు కూరగాయలు కొనటాన్ని ఆర్థికభారంగా భావిస్తున్నారు. రైతులు తెచ్చిన కూరగాయలు వినియోగదారుల వద్దకు వచ్చేసరికి ఈ ధరలు రెట్టింపు అవుతున్నాయి. టమాట రూ.41లు, బీట్‌రూట్ రూ.50లు, క్యారెట్ రూ.60లు, కాలీఫ్లవర్ రూ.40లు, బీన్స్ రూ.75లు, క్యాప్సికం రూ.50లు, కాకరకాయలు రూ.45లు, బెండకాయలు రూ.35లు, సొరకాయలు రూ.55లు, దొండకాయలు రూ.60లు, బీరకాయలు రూ.70ల చొప్పున అమ్ముతున్నారు.

హైదరాబాద్ వార్త


# కూరగాయల మంటలు

## కూర కారమై.. ఆర్థిక భారమై ◻ పైపైకి కూరగాయల ధరలు

హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త : కూరగాయల ధరలు మండుతున్నాయి. కూరగాయలు కొనాలంటే ప్రజలు బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. హోల్‌సేల్ మార్కెట్లో కాస్త తక్కువ ఉన్నట్లు కనిపించినా రిటైల్ మార్కెట్, షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్‌లో ధరలు మండిపోతున్నాయి. కొనబోతే కొరిమి అన్నట్లుందని, ఎక్కడ చూసినా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజార్లలో ఒకరేటు, బస్తీల, కాలనీలలో కూరగాయల మార్కెట్‌లలో మరోరేట్లు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలంటున్నారు. రాజకీయ పార్టీలు ఎన్ని ఉన్నా ధరలు తగ్గించేందుకు ఏ ఒక్కరు కృషిచేసిన పాపాన పోలేదంటున్నారు. ఏంకొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు. కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ మోండా, మాదన్నపేట వంటి మార్కెట్‌లతో పాటు గ్రేటర్ పరిధిలోని 11 రైతు బజార్లకు రోజువారీగా దిగుమతి కూరగాయల రాక తగ్గిపోయింది. దీంతో ధరలు విపరీతంగా పెరిగాయి. నగర జనాభా ప్రకారం ప్రతి రోజు సుమారు మూడు వేల టన్నుల కూరగాయలు అవసరం. నగరానికి కూరగాయ దిగుమతి తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్ నుంచి దిగుమతి అవుతాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల దిగుబడి భారీగా తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

మరోవైపు గత ఏడాది భారీ వర్షాలకు అక్కడ ఉల్లి పంట తుడిచి పెట్టుకుపోవడంతో తీవ్ర కొరత ఏర్పడింది. గత ఏడాది కన్నా ఉల్లి కొరత ఎక్కువ కావచ్చని కేంద్ర ప్రభుత్వం ఎగుమతులను నిలిపివేసింది. కొద్దిరోజులుగా నిరంతరం కురుస్తున్న వర్షాలు మంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. వానల తాకిడికి దెబ్బతినగా మిగిలిన కూరగాయలను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. రైతులు తెచ్చిన కూరగాయలు నాణ్యత లేదంటూ వ్యాపారులు హోల్‌సేల్ ధరలు తగ్గిస్తున్నారు. వర్షాల తాకిడికి కూరగాయల నాణ్యత దెబ్బతిన్నాయని సాకుగా చూపించి రైతుల నుంచి వ్యాపారులు, దళారులు తక్కువ ధరకు వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఇక వినియోగదారులకు మాత్రం అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇటు వినియోగదారులు, అటు రైతులు నష్టపోతుండగా.. దళారులు, వ్యాపారులు మాత్రం మధ్యలో లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడే ధరలు ఇంతలా ఉండే వచ్చే శీతాకాలం, ఎండాకాలంలో ఎంత ఎక్కువగా ఉంటాయోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ధరల పెరుగుదలకు ఇటీవల కురిసిన భారీ వర్షాలే కారణమని, కారణమేదైనా సామాన్యులకు మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా ధరలు తగ్గించేందుకు కృషిచేసి ప్రతి కుటుంబంలో ఉత్సాహం నింపేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

# నగరాన్ని ముంచెత్తిన వాన

**మరోసారి వరుణుడి ప్రతాపం**

**స్తంభించిన జనజీవనం**

**జలమయమైన రోడ్లు**

**ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం**



హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త : కొన్ని రోజులుగా నగరాన్ని వరుణుడు వదలట్లేదు. ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.రాగల రెండు రోజులు కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, ఆదివారం మరోసారి తన ప్రతాపాన్ని చూపించాడు. ఉదయం నగరవ్యాప్తంగా వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలుచోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్లు చెరువుల్లా మారిపోయాయి. వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా జిహెచ్‌ఎంసి సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. రోడ్ల మీద వర్షపు నీళ్ల నిలిచి ప్రజలు ఇబ్బం దులు పడుతుంటూ జిహెచ్‌ఎంసి సిబ్బంది ఏమాత్రం పట్టించుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. వాన కొనసాగుతూనే ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా ఇబ్బంది ఎదురైంది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకున్నారు.వద్దంటే వానలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు, బస్తీలు తరచూ జలమయమౌతున్నాయి. ఎటు వైపు చూసినా చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అనేక చోట్ల రహదారులు జలమయమయ్యాయి. రోడ్లు బాగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉప్పల్, బోడుప్పల్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, తిరుమలగిరి, బేగంపేట్, అల్వాల్, చిలకలగూడ, కోఠి, బేగంబజార్, సుల్తాన్‌బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, హైదర్‌గూడ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లక్డీకాపూల్, ఆర్టీస్ క్రాస్‌రోడ్, ముషీరాబాగ్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, రామ్‌నగర్, అంబర్‌పేట, దోమలగూడ, బోలక్‌పూర్, కవాడిగూడ, గాంధీనగర్, జవహర్‌నగర్, అమీర్‌పేట్, మైత్రివనం, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, బంజారాహిల్స్, షేక్‌పేట్, గోల్కొండ, మణికొండ, టోలిచౌకి, మెహదీపట్నం, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలుప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# వాహనదారులకు పగలే చుక్కలు

## ట్రాఫిక్ పద్మవ్యూహంలో కూకట్‌పల్లి ■ అధికారులు కార్యాలయాలకే పరిమితమా..?

కూకట్‌పల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త: కూకట్‌పల్లి ముంబాయి జాతీయ రహదారితోపాటు అంతర్గత రోడ్లు ట్రాఫిక్ జాంలకు నిలయాలుగా మారాయి.కూకట్‌పల్లి, గోద్రేజ్ చౌరస్తా, ప్రశాంత్‌నగర్, బాలానగర్‌లోని ఐడిపిఎల్ కంపెనీ, మూసాపేట, వివేకానందనగర్‌కాలనీ, జెఎన్‌టియూ, నిజాంపేట చౌరస్తా, హైదర్‌నగర్ తదిర ప్రాంతాల్లో రహదారులన్నీ ట్రాఫిక్ వలయాల్లో చిక్కుకుంటున్నాయి. కొన్ని చోట్ల కిలోమీటర్ ప్రయాణానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. ప్రధాన రహదారులు, అనుసంధాన దారులు వాహనాలతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. నిత్యం లక్షలాది మంది ప్రయాణించే రాకపోకలతో కిటకిటలాడే ఈ రహదారుల్లో ట్రాఫిక్ పోలీసులు మొక్కుబడిగా చర్యలు తీసుకుంటుండడంతో సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. కెపిహెచ్‌బికాలనీ, కూకట్‌పల్లి, హైదర్‌నగర్ ,మూసాపేట, గోద్రేజ్‌చౌరస్తా, భాగ్యనగర్‌కాలనీ, నిజాంపేట చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఉన్నటువంటి వాణిజ్య సముదాయాలు, వస్త్ర సముదాయాలు, హోటళ్ళు, ప్రైవేట్ ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ద్విచక్ర, కార్ల షోరూంలు, సెల్‌ఫోన్ దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపులు రహదారుల కిరువైపులా పెద్దఎత్తున ఉన్నాయి. అనేక మంది నిర్వాహకులు దర్జాగా రహదారులపైనే అక్రమ పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తుంటారు. కస్టమర్ల వాహనాల పార్కింగ్‌లతో ఇక్కడి రహదారులు కిక్కిరిసిపోతాయి. వ్యాపార, వాణిజ్య సముదాయాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ఇక్కడకు వచ్చే వినియోగదారులు రోడ్లమీదనే తమ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటు న్నాయి. దీంతో రహదారులు కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. దీనికి తోడు చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారస్తు లు, ఆటోవాలాల అక్రమ పార్కింగ్ వల్ల రోడ్లు కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. సాయంత్రం సమయంలో ఇక్కడ ఎక్కువగా ట్రాఫిక్ జామ్ జరుగుతోంది. కాని పోలీసులు మాత్రం పెద్దగా పట్టించుకోవడంలేదు. అక్రమ పార్కింగ్ మూలంగా ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాలు తమ గమ్యస్థానాలకు సాఫీగా వెళ్లలేని పరిస్థితి అక్రమ పార్కింగ్ వల్ల ఉంది. దీనికి తోడు ఎక్కడ పడితే అక్కడ సెవెన్‌సీటర్ ఆటోలతోపాటు మూడు చక్రాల ఆటోలాల్ని అక్రమ పార్కింగ్ చేయడం వల్ల కూడా అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఆటోల డ్రైవర్లు అయితే అడ్డదిడ్డంగా రోడ్లమీదనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అనేక సమస్యలకు కారణమవుతోంది. ఆటోల్లో ప్రయాణికులు నిండే వరకు ఆటోల్ని ఆక్కడ నుంచి తీయడంలేదు. దీని కారణంగా వెనుక నుంచి వచ్చే వాహనాలను వెళ్ళడానికి వీలుకాకపోవడంతో ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ట్రాఫిక్ పోలీ సులు పట్టించుకోకపోవడంతో సమస్య నానాటికి జఠిలంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. వెల్లువలా వచ్చే వాహనాలకు ఈ అక్రమ పార్కింగ్ అనేక సమస్యలకు కారణమవుతుంది. ఈ విషయంలో అటు ట్రాఫిక్ పోలీసులు ఇటు షాపుల యజమానులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. వ్యాపార సముదాయల్లో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్ల మీదనే పార్కింగ్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. అటు వాహనదా రులు ఇటు పాదాచారులు పడరాని పాట్లు పడుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలను అనుమతులకు విరుద్ధంగా నిర్మించడంతో పాటు పార్కింగ్ సదుపాయం కోసం వదలాల్సిన సెల్లార్లను తమ స్వార్థ ప్రయోజ నాల కోసం వ్యాపార ధోరణితో వాడుకుంటున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారితోపాటు అంతర్గత రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అవసరం లేని చోట్ల నిలబడి ట్రాఫిక్ ఉల్లంఘనల పేరుతో ఇక్కట్లకు ఇబ్బందులు పెట్టే ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది ఆక్రమణలకు పాల్పడుతున్న దుకాణదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 పరీక్షలు



హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త : నగరంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం నిర్వహించిన పరీక్షకు 75శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. 503 పోస్టు లకు గాను 3.80 లక్షల మంది అభ్య ర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎనిమిది రోజుల్లో ఓఎంఆర్ షీట్ల స్కానింగ్ ప్రక్రియ పూర్తవుతుందని, ఆ తర్వాత ప్రాథమిక కీ విడుదల చేస్తామని టిఎస్‌పీ ఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించడంతో భారీ సంఖ్యలో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకున్న అధికారులు, కేంద్రం లోపలికి షూలు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు.

# వీణా వాణిలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి



**వీణా వాణిలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్**

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 16, ప్రభాతవార్త : అవిభక్త కవలలైన వీణా వాణిల పుట్టిన రోజు వేడుకలు ఆదివారం మధురా నగర్ కాలనీలోని మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యవతి రాదోడ్ హాజరై చిన్నారులకు పుటిన్టనరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా వారితో కేక్ కట్ చేయించారు. వారికి కేక్‌ని తినిపించారు. అనంతరం వారికి బహుమతి ప్రధానం చేశారు. ఇందులో భాగంగా కొద్దిసేపు వారితో మాటామంతి కలిపారు. అన్ని విషయాలను వారితో మాట్లాడుతూ సరదాగా జోకులు వేస్తూ, కవ్విస్తూ, వారిని ఉత్సాహపరుస్తూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు.

**సిఎ చదువుకు ప్రభుత్వం సహాయం చేస్తుంది : మంత్రి సత్యవతి రాథోడ్**

చిన్నారులు వీణావాణిలు తాము భవిష్యత్తులో చార్టెడ్ అకౌంట్స్ కావాలని ఆశిస్తున్నారని తప్పకుండా వారు సిఏ చదవడానికి ప్రభుత్వం తమ సహాయ సహకారాలను అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వీణావాణీలతో పాటు ప్రతిఒక్కరు తెలంగాణ ముద్దుబిడ్డలని వారిని ప్రభుత్వం సొంత బిడ్డలా చూసుకుంటుందని అన్నారు. మీరు నిరంతరం ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో వాణి వీనాలు తమ సత్తా చాటడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈఫలితాలు ప్రతి ఒక్కరికి స్పూర్తి దాయకంగా ఉన్నాయని తెలియజేశారు.

# బుద్ధ విహార్ ఆలయంలో బౌద్ధ బిక్షువుల దాన వేడుకలు



**మహేంద్రహిల్స్ మహాబోధి ఆలయంలో బౌద్ధ బిక్షువుల కఠిన చివర దానం వేడుకల్లో పాల్గొన్న మాజీ డిజి అంజనేయ రెడ్డి**

కంటోన్మెంట్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్‌లో ప్రసిద్ధి గాంచిన మహాబోధి బుద్ధ విహార్ ఆలయంలో బౌద్ధ బిక్షువుల కఠిన చివర దాన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వివిధ దేశాల నుంచి బౌద్ధ బిక్షువులు పాల్గొన్నారు. భక్తులు, బౌద్ధ బిక్షువులకు వస్త్రదానం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అధికారి రిటైర్డ్ డిజి అంజనేయ రెడ్డి, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వెంకటయ్య, హెచ్ఎండిఏ ప్లానింగ్ ఆఫీసర్ యాదగిరి రావు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు కె.లక్ష్మయ్య, సూర్య నారాయణ, నిమ్మ నారాయణ, సత్య నారాయణలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మహేంద్రహిల్స్ మహాబోధి సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్ బిక్షు సుగతానంద, మహాబోధి సొసైటీ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బిక్షు ఆనంద, ప్రతినిధులు గంగాధర్, మురళీధర్ రెడ్డి, విమల్ పార్వ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అదే విధంగా వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**జహీర్‌ఖాన్‌తో కలిసి ఎస్ఎఫ్ఎ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

గచ్చిబౌలి, అక్టోబరు 16 ప్రభాతవార్త : యువత క్రీడల పట్ల ఆసక్తి చూపించాలని తెలంగాణ క్రీడలు, ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఎ) ఛాంపియన్‌షిప్ హైదరాబాద్ 2022ను ఆదివారం క్రికెటర్ జహీర్‌ఖాన్‌తో కలిసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నేడు యువత వీడియో గేమ్‌లు, మొబైల్ స్క్రీన్‌లకు అతుక్కుపోతున్నారని, చిన్నతనం నుంచే యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు, రాణించేందుకు ఎస్ఎఫ్ఎ ఛాంపియన్‌షిప్ ఓ అవకాశంగా నిలుస్తుందన్నారు. ఎస్ఎఫ్ఎ వంటి ఛాంపియన్‌షిప్‌లతో దేశంలో క్రీడలకు ఆధరణ పెరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, క్రీడాకారులకు అన్ని రకాలుగా చేయుతను అందిస్తుందన్నారు. క్రికెటర్ జహీర్‌ఖాన్ మాట్లాడుతూ స్పోర్ట్స్ ఫర్ ఆల్ నిర్వహిస్తున్న ట్రైల్‌బ్లేజింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. క్రీడలు వినోద సాధనంగానే కాకుండా, జీవిత ప్రయాణంలో నైపుణ్యాలను, లక్షణాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతాయన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నా యని తెలిపారు. ఎస్ఎఫ్ఎ హైదరాబాద్ ఛాంపియన్‌షిప్ 2022లో నగరంలోని 640కి పైగా పాఠశాలల విద్యార్థులు పాల్గొంటుండడం తో అతిపెద్ద క్రీడా ఈవెంట్‌గా ఇది నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సమేరాఖాన్‌తో పాటు ఎస్ఎఫ్ఎ అధికారులు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నగరానికి హరిత నగరాల అవార్డు



**కార్యక్రమంలో పాల్గొన్న నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి**

హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త: తెలంగాణకు హరితహారం 'ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌కు గుర్తింపు లభించింది. బ్రెజిల్‌లోని ప్యారిస్, బోగోటా, మెక్సికో సిటీ, మూంట్రియల్, ఫోర్టలెజాలను ఓడించి లివింగ్ గ్రీన్ ఫర్ ఎకనామిక్ రికవరీ అండ్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ విభాగంలో ప్రపంచ హరిత నగరాల అవార్డును హైదరాబాద్ కైవసం చేసుకుంది. అసోసియేషన్ ఇంటర్నేషనల్ డేస్ ప్రొడక్చర్స్ డిఎల్ హార్టికల్చర్(ఎపిఐహెచ్‌డి) ద్వారా నెలకొల్పిన ఈ అవార్డు ల్యాండ్ స్కేపింగ్, మొక్కలు, పువ్వుల పెంపకంలో ఉత్తమ పద్ధతులను గుర్తించడానికి ప్రయత్నిస్తుంది. 2015-16 నుంచి పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిన తెలంగాణకు 'హరితహారం' అవార్డు గుర్తించింది. హైదరాబాద్‌లోని బహుళ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్ వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డును గెలుచుకోవడానికి కీలకమైన అంశాల్లో ఒకటి. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని, సిఎం కెసిఆర్ కృషి వల్లనే ఈ అవార్డు రావడం జరిగిందని అన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ పట్టుదలతో జిహెచ్‌ఎంసి అధికారులకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు క్లీన్‌సిటీగా ఉంచడం, మొక్కలు నాటడం, కాలు ష్యాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవడం సాధ్యమైందన్నారు. జరిగిన కార్యక్రమంలో టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, టిఆర్‌ఎస్ కార్యకర్తలు, జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

# కిరాయి హంతకుల పనేనా..?

## ప్రాణం తీసిన పూజలు • మిస్టరీగా మారిన ఉప్పల్ తండ్రి, కొడుకుల హత్య కేసు

ఉప్పల్, అక్టోబరు 16 ప్రభాతవార్త : ఉప్పల్‌లో తండ్రి, కొడుకుల హత్య కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఇప్పటి వరకు ఆస్తి తగాదాలతోనే హత్య చేసినట్లు పోలీసులు మొదట విచారణ చేయగా, కొందరు నిందితులు పట్టుబడడంతో హత్యకు పూజలు కారణమని తెలుస్తోంది. గత శుక్రవారం ఉదయం ఉప్పల్ హనుమసాయికాలనీకి చెందిన ఎన్.నరసింహాశర్మ, అతని కుమారుడు శ్రీనివాస్‌లను కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో ఇప్పటికే 15 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి విచారణ సాగిస్తుండగా, ఇప్పటి వరకు సుమారు 30 మందిని విచారించిన పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులు వారం రోజులుగా అదే ప్రాంతంలో రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం హత్యచేసి పరారైనట్లు పోలీసులు పేర్కొంటున్నారు. మృతుల ఇంటికి సమీపంలోనే నిందితులు బస చేసి హత్య చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పూజలు చేయాలని చెప్పి ఇంట్లోకి ప్రవేశించి ఎన్.నరసింహాశర్మతోపాటు, శ్రీనివాస్‌లను కత్తులు, గొడ్డలితో హత్య చేసి పరారైన విషయం తెలిసిందే. హంతకులు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, నిందితులు హత్య జరిగిన ప్రాంతంలో తిరిగిన సిసి కెమెరా దృశ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సిసి పుటేజ్‌ల ఆధారంగా పోలీసులు ఇప్పటికే నిందితుల చిత్రాలు తీసి అన్ని స్టేషన్లకు పంపించినట్లు సమాచారం. అయితే నరసింహాశర్మను మాత్రమే కిరాయి హంతకులతో హత్య చేసేందుకు మొదట ప్రణాళిక రూపొందించగా, అనుకోకుండా అతని కుమారుడు శ్రీనివాస్ కూడా హత్య చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. నరసింహాశర్మ స్థానికంగా పౌరోహిత్యం చేయడంతోపాటు, ఇంటి వాస్తు చెప్పడం, శ్రీశైలం తీసుకెళ్లి భక్తుల కోరిక మేరకు పూజలు సైతం చేయించే వాడని పలువురు పేర్కొంటున్నారు. అయితే హత్య చేసిన నిందితులను ఇప్పటికే గుర్తించిన పోలీసులు పథకం ప్రకారం హత్య చేయించిన అసలు నిందితుల కోసం వేట సాగిస్తున్నారు. సోమవారంలోగా పూర్తి విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా నరసింహాశర్మ, శ్రీనివాస్‌ల కళ్లను ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రికి దానం చేశారు.

# దేశంలో కార్పొరేటీకరణ పరుగులు తీస్తోంది



**కార్పొరేటీకరణ, భారత రాజకీయ ఆర్థిక వ్యవస్థ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం**

చిక్కడపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త: కార్పొరేటీకరణ, భారత రాజకీయ ఆర్థిక వ్యవస్థపై పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. కమిటీ రాష్ట్ర నాయకుడు కనకాచారి స్మృతిలో జరిగిన ఈ కార్యక్రమానికి పిడిఎం రాష్ట్ర కన్వీనర్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని ఆశాలత పరిచయం చేయగా ఎన్.వేణుగోపాల్, కన్నెగంటి రవి, ఎన్.రవి ఆవిష్కరించారు. కార్పొరేటీకరణ అర్ధ భూస్వామ్య అర్ధవలస దోపిడి అంశంపై ఎన్.వేణుగోపాల్, కార్పొరేటీకరణ వ్యవసాయ రంగం అంశంపై కన్నెగంటి రవి, కార్పొరేటీకరణ సైనికీకరణ వ్యతిరేక ఉద్యమాలకు అవకాశాలు అంశంపై ఎన్.రవి ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశంలో కార్పొరేటీకరణ పరుగులు తీస్తోందని, ఇది ఎప్పుడు, ఎలా మొదలైంది, నేడు మోదీ, నిర్మలాసీతారామన్ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని అన్నారు. భారత పాలకవర్గాలు దళారీస్వభావాలకు, కార్పొరేటీకరణకు ఉన్న సంబంధం ఏమిటి, అంతర్జాతీయ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న పనితీరులో దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి అనే విషయాలను వక్తలు క్షుణ్ణంగా వివరించారు.

## సికింద్రాబాద్ పార్లమెంటులో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు సమీక్ష

ధర్నాచౌక్, అక్టోబర్ 16, ప్రభాతవార్త: సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితిపై ఆపార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు సమీక్ష జరిపారు. శనివారం రాష్ట్ర పార్టీ కార్యాలయం అయిన ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో తెలంగాణ నాయకులతో చంద్రబాబు నాయుడు సమావేశం నిర్వహించిన సంగతి తెలిసినదే. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు, పార్టీ చేపట్టిన కార్యక్రమాల వివరాలను నియోజకవర్గం అధ్యక్షులు పి.సాయిబాబా నివేదిక రూపంలో చంద్రబాబునాయుడికి అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.బాలరాజు గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి పాల్గొన్నారు.

## టిఎంపిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాదారపు రామన్నమాదిగ

చిక్కడపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త: తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి(టిఎంపిఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాదారపు రామన్నమాదిగను నియమితులయ్యారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్ మాదిగ ఆదేశాల మేరకు నియమించినట్లు ప్రధాన కార్యదర్శి ఎర్ర రాంచందర్ మాదిగ వివరించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రామన్న మాదిగ ఉద్యమకారుడు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం, ఎస్సీవర్గీకరణ సాధనే లక్ష్యంగా, హక్కుల కోసం మాదిగజాతిని ఏకం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగడంతో పాటు ఉద్యమిస్తామన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సమితి సమావేశంలో ఈ మేరకు నియామకం జరిగిందని వివరించారు. సమావేశంలో రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు మాదిరే నర్సింగరావు, ఇంజం సాంబయ్య, మెతుగు వెంకన్న, బెజ్జంకి బాబు, ఆకులపెల్లి వీరలు, సోమారపు యాకయ్య, బండారి సుదర్శన్, గడ్డం సుధాకర్ పాల్గొన్నారు.

## పబ్లిక్ స్కూల్ బాల్య మిత్రులకు అభినందన



రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో గద్వాల బాబిరెడ్డిని అభినందిస్తున్న సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త : బాల్యస్నేహం విడదీయరాని బంధమనీ ఎన్నాళ్లయినా ఎన్నేళ్లయినా..ఆ రోజులు మరుపురానివని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్ పూర్వ విద్యార్థులు మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. నగరంలోని ఒక హోటల్‌లో పూర్వ విద్యార్థుల అభినందన సభ జరిగింది. హైదరాబాద్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి జీవిత భాగస్వామి గద్వాల బాబిరెడ్డిని బాల్యమిత్రులు అభినందించారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాదులు, పారిశ్రామికవేత్తలు, విశ్రాంత సైనిక అధికారులు, ఉన్నత ఉద్యోగులు పాల్గొని తమ చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు.


## పాలప్యాకెట్ కోసం వెళ్లిన యువతి అదృశ్యం

కంటోన్మెంట్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ఇంటి నుంచి పాలప్యాకెట్ కోసం వెళ్లిన ఓ అమ్మాయి అదృశ్యమైన సంఘటన బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ రవికుమార్ కథనం ప్రకారం. బోయిన్‌పల్లి దుబాయ్‌గేట్ ప్రాంతానికి చెందిన దశరత్ కుమార్తె సుచిత్ర (20) పాల ప్యాకెట్‌ను తీసుకొని వస్తానని చెప్పివెళ్లింది. సాయంత్రం అయినా ఆమె ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె తండ్రి వారి బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకి కోసం ప్రయత్నించినా ఆమె ఆచూకి లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు గర్ల్ మిస్సింగ్ కేసు నమోదు చేసి ఆచూకి కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

మెట్టుగూడ, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మెట్టుగూడ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో కార్పొరేటర్ రాసూరి సునిత పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా సెవరేజ్ పైపులైన్ పనులను చేయించామని అనంతరం సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ దృష్టికి ప్రతి సమస్యను తీసుకు వెళ్లి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు.

## నీటి బకాయిలను చెల్లించకపోతే కఠిన చర్యలు తప్పవు : డిజిఎం క్రిష్ణ



మారేడ్‌పల్లిలో నీటి బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న జలమండలి అధికారులు క్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: నీటి బకాయిలను సకాలంలో చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జలమండలి డిజిఎం క్రిష్ణ హెచ్చరించారు. కమర్షియల్ నీటి బకాయిలు వసూళ్ల షల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నీటి బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిఎం క్రిష్ణ మాట్లాడుతూ వెస్ట్ మారేడ్‌పల్లి నారాయణ జూనియర్ కళాశాల భవనానికి రూ.53 వేలు నీటి బకాయిలు ఉన్నాయన్నారు. మారేడ్‌పల్లి సెక్షన్ పరిధిలో కోటి రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. మంచినీటి బకాయిలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ మేనేజర్ హాకీం, ఇమ్రాన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేట బస్తీల్లో నిలిచిన మురుగునీరు

### నాలాను ఆనుకుని ఉన్న బస్తీల్లో దోమల దాడితో స్థానికుల విలవిల

బేగంపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త : ఒక వైపు వీడని వర్షం. మరో వైపు కూకట్‌పల్లి నాలాలో నీటి ఉధృతి నాలా పరివాహక బస్తీల ప్రజలకు నిద్రలేని రాత్రులను మిగులుస్తుంది.ఒక వైపు నాలా నీరు.వర్షం నీరు నిల్చి బస్తీ వాసులను ఇబ్బంది పెడుతుండగా, మరో వైపు దోమల దాడితో వారు విల విల లాడిపోతున్నారు.గడచిన నాలు గైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు కూకట్‌పల్లి నాలాలో నీటి ఉధృతి పెరగడంతో బేగంపేట బ్రాహ్మ ణవాడీ పరిధిలోని ఆర్ఆర్‌గోపాల్ కాంపౌండ్‌లో పెద్ద ఎత్తున మురుగు నీరు రోడ్లపై నిల్చి ఉంది.నాలాలో నీటి ఉధృతి పెరగడంతో పాటు వర్షం కురుస్తుండటంతో డ్రైనేజీల వ్యర్థాలు మ్యాన్ హోల్స్ ద్వారా బయటకు వచ్చి రోడ్లపై నిల్చిపోతున్నాయని, దీంతో నీటిలో దిగి నడవాలంటే ఎంతో ఇబ్బందిగా ఉందని,బ్రాహ్మణ వాడీ, వడ్డెర బస్తీ, ఆర్ఆర్‌గోపాల్ కాంపౌండ్ బస్తీల వాసులు వాపోతున్నారు.వర్షాలు కురుస్తుండటంతో ఇళ్లలోని సంపులలోకి కూడా మురుగు నీరు చేరుతుందని,తాగు నీరు సైతం కలుషితం అవుతుందని బస్తీల వాసులు ఆరోపిస్తున్నారు.డ్రైనేజీల నుంచి వస్తున్న వ్యర్థాలు తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయని వారు వాపోతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంతో పాటు అకాల వర్షాలు కురిసి నాలాలో నీటి ఉధృతి పెరగిన సమయంలో తమ బస్తీల్లో నీరు నిల్చిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దోమల దాడి అధికమైంది, నియంత్రణ చర్యలు చేపట్టాలి : వాహెద్**

బేగంపేట డివిజన్ పరిధిలోని పలు బస్తీలైన ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ,వడ్డెర బస్తీ, బ్రాహ్మణవాడీ, మాతాజీనగర్, అల్లంతోట బాయి,చికోటి గార్డెన్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ తదితర బస్తీల్లో భారీగా వరద నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఇబ్బందులను తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు వాహెద్ డిమాండ్ చేసారు. ఆదివారం ఆర్ ఆర్ గోపాల్ కాంపౌండ్‌లో పర్యటించి స్థానికుల ఇబ్బందులను అడిగి తెల్సుకున్నారు. ఈ సందర్భంగా వాహెద్ మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో పై బస్తీల వాసులకు వరద నీటి ముంపు ఇబ్బందులు తప్పడం లేదని, వరద నీటి ముంపు నుంచి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే దోమల నివారణకు సంబంధించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేసారు. నాలా పరివాహక బస్తీల్లో జీహెచ్ఎంసీ, ఎంటమాలజీ శాఖ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు.

## బాలకామేశ్వరరావుకు ఆత్మీయ సత్కారం-'శతాబ్ది గాయకునికి స్వరార్చన'



గాయకుడు బాలకామేశ్వరరావును సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త: తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సహకారంతో అక్కిరాజు మ్యూజికల్స్ ఈవవెంట్స్ అధినేతలు అక్కిరాజు యోగిత, అక్కిరాజు ప్రభంజన్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు బాలకామేశ్వరరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది.ముఖ్యఅతిథులుగా దర్శకులు, సినీగేయరచయిత బాబ్జీ హాజరవగా విశిష్ట అతిథులుగా దర్శకులు, నటులు మీర్, గౌరవ అతిథులుగా ఘంటసాల కుమార్తె ఘంటసాల శ్యామల హాజరై బాలకామేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమరగాయకులు పద్మశ్రీ ఘంటసాల వెంకటటేశ్వరరావు శతజయంతి సందర్భంగా యోగిత అక్కిరాజు ఆధ్వర్యంలో 'శతాబ్ది గాయకునికి స్వరార్చన' పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. గాయనీ గాయకులు డాక్టర్ శ్రీనివాస్ భరద్వాజ్, సతీష్ రామిశెట్టి, నడిమింటి గణపతి, కళ్యాణ్ కోటంరాజు, డాక్టర్ రాజ్, శంకర్, రమణ గోగన, రవవి మాగంగి, జయప్రకాశ్, కె.శివరామకృష్ణ, రవికొండూరి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవ మల్లాది, ఎన్.శ్రీనివాస్, డాక్టర్ సాయిసింధూర, సాయిమేఘన, తుషార నిలయ, ఇంద్రాణి, స్నేహహాసంతి తదితరులు అద్భుతంగా గానం చేశారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, మణిద్వీప్ కన్‌స్ట్రక్షన్స్ ఉపాధ్యక్షుడు, గాయకుడు కె.యి.రాజు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ లక్ష్మణేశ్వర కళ్యాణ మందిరం చైర్మన్ అన్నారావు కులకర్ణి,ఎన్‌బికెఎ అధ్యక్షులు గణేష్ నాయక

చార్మినార్, అక్టోబరు 16 ప్రభాతవార్త : క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహించవలిసిన అవసరం ఎంతైనా ఉందని శ్రీ లక్ష్మణేశ్వర కళ్యాణ మందిరం చైర్మన్ అన్నారావు కులకర్ణి అన్నారు. ఉడిపిలో నవంబరు నెల నాలుగు నుంచి ఆరవ తేదీ వరకు జరగనున్న ఆల్ ఇండియా బూడో కరాటే ఫెడరేషన్ నేషనల్ కరాటే చాంఫియన్ షిప్ పోటీలకు ఎన్‌బికెఎ విద్యార్థులు ఎంపిక అయ్యారు.పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆదివారం శివగంగానగర్‌లోని శ్రీ లక్ష్మణేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలువురు అభినంధించారు.ఈ సందర్భంగా అన్నారావు కులకర్ణి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయాన్ని అందించాలని కోరారు.ఎన్‌బికెఎ అధ్యక్షులు పి.గణేష్ నాయక్, కరాటే మాస్టర్ రవీందర్, రాహుల్, శ్రీనిత, శివానీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యకు వయసుతో సంబంధం లేదు



కరాటే విద్యార్థులతో ఎసిపి వెంకట్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త: విద్యకు వయసుతో నిమిత్తం లేదని అన్ని వయసుల వారు విద్యను అభ్యసించవచ్చునని అబిడ్స్ ఎసిపి వెంకట్‌రెడ్డి చెప్పారు. విద్య జ్ఞానాన్ని ఇస్తుందని, విద్యా ద్వారా యువతీ యువకులు అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఆదివారం నాడిక్కడ జివిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ గ్రేడింగ్‌లో ఉత్తీర్ణులైన 52 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికేట్లు ప్రదానం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కరాటే అభ్యసించడం వల్ల మనోధైర్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి, అకాడమీ డైరెక్టర్ డా.జి.ఎస్.గోపాల్‌రెడ్డి, అకాడమీ బ్లాక్ బెల్టులు కరీం, సుభాష్, సర్వర్, మహేందర్, అమృత్‌రెడ్డి, జానికి, యోగిని, షైనీ, నందిని తదితరులు పాల్గొన్నారు.

**శివార్లలో ప్రశాంతంగా గ్రూప్ 1 పరీక్షలు**

సరూర్‌నగర్, అక్టోబరు 16 ప్రభాతవార్త : హైదరాబాద్ నగర శివార్లలో ఆదివారం టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ 1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మీర్‌పేట్ పిఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన 13 కేంద్రాల్లో భారీ పోలీసు బందో బస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4726 మంది అభ్యర్థులకు గాను 3286 మంది పరీక్షలకు హాజరయ్యారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లు పరిశీలించి తనిఖీలు చేసిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమ తించారు.

## అమ్మాయిలపై హింసను అరికట్టాలి

సైఫాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త: బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక చాలు అనే బ్యానర్‌పై బాలికల స్వేచ్ఛపై బాలికల స్వతంత్రతపై యువ సమ్మేళనం ఆదివారం అదర్శనగర్‌లోని బిర్లా ప్లానిటోరియంలో నిర్వహించింది. ఈ సదస్సుకు రంగారెడ్డి, వికరాబాద్, సూర్యాపేట, జోగులాంబ, హైదరాబాద్ జిల్లాల నుంచి 11 నుంచి 18 సంవత్సరాల వయసులోపు వందలాది మంది అమ్మాయిలు హాజరై ఆడపిల్లలపై లైంగిక వేధింపులు, మానసిక, శారీరక హింసను తక్షణమే ఆపాలని గళమెత్తారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతి అమ్మాయి మహిళలకు స్వాతంత్ర్యం ఇవ్వడమే కాకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా అమ్మాయిలు పలు తీర్మానాలను ఏకగ్రీవంగా అమోదించడం జరిగింది. ముఖ్యంగా కళ్యాణ లక్ష్మి పథకంపై వెచ్చించే డబ్బులు అమ్మాయిల ఉన్నత విద్యకు కేటాయించాలని, బడ్జెట్‌లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని, బాల్య వివాహాలను ఖచ్చింతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో నెదర్లాండ్ నుంచి లిండా, భూమిక సంస్థ ప్రతినిధి సత్యవతి, ఎంవి ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, భాస్కర్, ప్రసన్న, సరస్వతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## నాలా పరీవాహక ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

చిక్కడపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త: హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంతాలైన గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతినగర్, దోభీఘాట్ తదితర ప్రాంతాలలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదివారం పర్యటించి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, గాంధీనగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు పోతుల శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, మారిశెట్టి నర్సింగరావు, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



మాదాపూర్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## ఒయూలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

### 18వేల మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, అక్టోబర్ 16 ప్రభాతవార్త: కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ.యూలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది.సుమారు 18000వేల మందికి ఉద్యోగాలు వరించాయి. మొదటి రోజు సుమారు 45000 మందికి పైగా అభ్యర్థులు రాగా 14000 వేల మందికి పైగా ఉద్యోగాలు వరించాయి. ఒయూకు చెందిన ఓ బిటెక్ విద్యార్థినికి ఫ్యాక్ట్ సెట్ అనే కంపెనీ రూ.9లక్షల ప్యాకేజీని ఆఫర్ ఇచ్చింది. రోండో రోజు 15000 వేలకు పైగా అభ్యర్థులు రాగా అందులో నుంచి 4000 వేల మందికి పైగా ఉద్యోగాలు సాదించారు. 15,16తేదీలో సుమారు 18000 వేల మందికి ఉద్యోగాలు వరించాయి. ఈ జాబ్ మేళాకు వైస్ చాన్స్‌లర్ ప్రొ. రవీందర్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ కోమటిరెడ్డి ప్రతీక్ సేవలను కొనియాడారు. విద్యార్థులు మేళాలో పాల్గొని ఉద్యోగాలను సాధించడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో నిపుణ సంస్థ పౌండర్, సేవా ఇంటర్నేషన్ మెంబర్ సుభద్రరాణి, హెచ్‌సిడిసి ఒయూ డైరెక్టర్ స్టివెన్ సన్, టీడిఎఫ్ యుఎస్ఏ మెంబర్ అరుణ్ కుమార్, ఐస్టాండ్ ఫర్ వారియన్స్ ఫౌండర్ హరికృష్ణ, ఐఎఫ్ఐఎన్ గ్లోబల్ సంస్థ శేశాద్రి వనజులా, నిపుణ నిర్వాహకులు హర్ష, కిర్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ వ్యవస్థపై అవగాహన కోసమే వారోత్సవాలు



గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్న ఫీల్డ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర తేలి

తార్నాక, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ప్రజలకు,ఉద్యోగులకు విజిలెన్స్ వ్యవస్థపై అవగాహన కోసమే విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్రతేలి పేర్కొన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ కోఠి ఆధ్వర్యంలో ఓ.యూ ప్లే గ్రౌండ్‌లో విజిలెన్స్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, అధికారులు క్రికెట్‌తో పాటు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్రతేలి మాట్లాడుతూ అవినీని రహిత సమాజం కోసం ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు బాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. డిజీఎం సుహాన్ సేన్ గుప్త, డీజీఎం, రీజినల్ హెడ్ ప్రమోద్ కుమార్‌ర రెడ్డి మాట్లాడుతూ విజిలెన్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఉద్యోగులు పారదర్శకంగా ఉండాలని, కేవలం ఆఫీసుల్లోనే కాకుండా ప్రజలకు కూడా అవగాహన ఉండాలన్నారు. ఈ లాంటి ఈవెంట్స్ ఉద్యోగస్తుల్లో, అధికారుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మానికేశ్వరీ, ఏజీఎం కె.ఎస్. మూర్తి, సిబ్బంది సంతోష్‌తో పాటు పలువురు సిబ్బంది, అధికారులు పెద్ద సంఖ్యలో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వ్యవసాయ ఆధారిత దేశంలోనే ఆకలి ఘోష

**తెలంగాణ అడ్వకేట్ జేపసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ధర్నాచౌక్, అక్టోబర్ 16, ప్రభాతవార్త: వ్యవసాయ ఆధారితమైన మన దేశంలోనే ఆకలి ఘోష ఎక్కువగా ఉండటం విచారకరమని తెలంగాణ అడ్వకేట్ జేపసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆయన ఒక విలేఖరులతో మాట్లాడుతూ గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2022 రిపోర్ట్ ప్రకారం 121 దేశాలలో ఆకలి స్థాయిని పరిశీలిస్తే మన దేశం 107వ స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వాస్తవ పరిస్థితులపై స్పందించి, వ్యవసాయం, రైతులు, సేద్యం, మౌళిక సదుపాయాలు, వాటి విధి విధానాలను యుద్ధప్రాతిపదికన అమలు చేస్తే, దేశం ఎదుర్కొంటున్న ఆకలి సమస్యను అధికమించవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. పాలకులు ఇప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరో పెద్ద శ్రీలంకగా ప్రపంచ దేశాల ముందు మనదేశం తలవంచకతప్పదని హెచ్చరించారు.

## జూపార్కులోని నెహ్రూ విగ్రహానికి రంగులు వేయాలి



జూపార్కు క్యూరేటర్ రాజశేఖర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

చార్మినార్, అక్టోబరు 16 ప్రభాతవార్త : నెహ్రూ జూలాజికల్ పార్కులో ఉన్న నెహ్రూ విగ్రహానికి రంగులు వేయాలని, గ్రిల్ వద్ద విరిగి పోయిన మెట్లుకు మరమ్మతులు చేయాలని కోరుతూ టిపిసిసి కార్యదర్శి జి.కన్నయ్యలాల్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు జూపార్కు క్యూరేటర్ ఎస్.రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో నెహ్రూ విగ్రహానికి రంగులు వేశారని,ఇంత వరకు తిరిగి నెహ్రూ విగ్రహానికి రంగులు వేయలేదని,నవంబరు నెల 14వ తేదీన భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని జూపార్కులో ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు క్యూరేటర్‌కు అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా టిపిసిసి కార్యదర్శి కన్నయ్యలాల్ మాట్లాడుతూ నెహ్రూ విగ్రహానికి రంగులు వేస్తామని,మెట్లకు మరమ్మతులు చేస్తామని క్యూరేటర్ హామి ఇచ్చారని తెలిపారు.కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇకా బ్బల్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ విద్యాబోధన: ఫాతిమా




విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న విజయలక్ష్మి, కనీజ్ ఫాతిమా


మలక్‌పేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యాబోధన చేస్తున్నట్లు సెక్టోరియల్ కనీజ్‌ఫాతిమా, ఉపవిద్యాశాఖ అధికారి విజయలక్ష్మిలు తెలిపారు. మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను విద్యావంతులైన ఉపాధ్యాయులు అనుభవాలను సరైన రీతిలో వినియోగించుకొని మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యే విధంగా పౌష్టిక ఆహారం తీసుకునే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేస్తున్నామని తల్లిదండ్రుల సహకారం కావాలని కోరారు.

# అధ్వాన్నమైన రోడ్లతో నిత్యం అవస్థలు

**బురదమయమైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్న ఆనంద్‌నగర్ కాలనీ వాసులు ● పట్టించుకోని అధికారులు, పాలకులు**



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్ నగర్ కాలనీలో అధ్వాన్న స్థితిలో ఉన్న రోడ్ల దృశ్యం



నార్సింగి, అక్టోబర్ 16 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీవాసులు అధ్వాన్నమైన రోడ్లతో నిత్యం అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి గత నాలుగు నెలలుగా ఈ కాలనీ ప్రజలు బురదమయమైన రోడ్లపై నడువలేక నరక యాతన పడుతున్నారు. రోడ్లన్నీ బురద, వరద నీటితో ఉండడంతో తమ ఇళ్ల నుంచి వివిధ పనులపై బయటకు వెళ్లే ప్రజలు బిక్కు బిక్కుమంటూ వెళ్తున్నారు. అనేకమార్లు విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు జారి బురదలో పడ్డ సంఘటనలున్నాయి. కనీసం పాల పాకెట్, కూరగాయలు, నిత్యవసర వస్తువులు తెచ్చుకునేందుకు వెళ్లాలన్నా బురదలోనే నడువాల్సిన దుస్థితిలో బతుకుతున్నారు. ఇక ఈ కాలనీలో ఉండే వృద్ధులు బురదలో జారి పడుతామేమోనని భయపడి నెలల తరబడి వాకింగ్‌లు కూడా మానేసుకున్నారు. ఇంతటి దుస్థితిలో ఆనంద్‌నగర్ కాలనీ ప్రజలు బతుకుతుంటే కనీసం ఒక్క నాయకుడు గాని, ఒక్క అధికారిగాని పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎందుకీ వివక్ష..** ఎన్నికల వేళ ఓట్ల కోసం వచ్చి వెళ్లిన నాయకులు మళ్లీ మా వైపు తిరిగి చూడడం లేదని, మా ఇబ్బందులను పట్టించుకోవడం లేదని వయోజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పోరేషన్ పరిధిలోని ఇతర కాలనీల ప్రజల వలే మేము కూడా టంచన్‌గా పన్నులు చెల్లిస్తున్నా మా కాలనీపై అధికారులు, పాలకులు ఎందుకు వివక్ష చూపుతున్నారని విద్యావంతులు ప్రశ్నిస్తున్నారు. మా కాలనీ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్నా ఇంకా మాకు సరైన రోడ్లు వేయకపోవడం వివక్ష కాదా? అని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే ఏర్పడుతున్న కాలనీల్లో అక్కడి బిల్డర్లు ఇస్తున్న డబ్బులు తీసుకుంటూ సరైన ఇళ్లు లేకున్నా రోడ్లు వేస్తూ, మా కాలనీకి ఎందుకు వేడయం లేదని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. సర్పంచ్‌లు మారారు... పంచాయతీలు పోయి మున్సిపల్, మున్సిపల్ పోయి కార్పోరేషన్.. వచ్చినా మా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు.

**కోట్ల నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారు?..**

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ప్రతీ మూడు నెలలకో మారు రూ.25 నుంచి 30కోట్ల నిధులతో అభివృద్ది పనులు చేపడుతున్నామని దినపత్రికలలో ప్రచారం చేసుకుంటున్న పాలకులు, అధికారులు మా కాలనీకి రోడ్డు వేసేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కనీసం రెండు ప్రధాన రోడ్లనైనా ముందుగా నిర్మించాలని అనేక మార్లు పాలకులు, అధికారులను కోరినా చేస్తాం, చూస్తామంటూ ముఖం చాటేస్తున్నారని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి మా కాలనీలో రోడ్లు వేయించి మా కాలనీ పేరులో ఉన్న ఆనందాన్ని మా ముఖాలలో చూడాల్సిన అవసరం ఉందని ఆనంద్ నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.


IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM IX ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD

MVOP. NO. 2353 OF 2021

Between:
RamDinesh ...PETITIONER

AND

VPadmavathi ... RESPONDENTS

R1.V Padmavathi W/o V Prasad Rao, Occ: Business / Owner of Car bearing No. TS 07 FW 8588,R/o Flat No. 128, Lotus L&T Serene County, Gachi bowli,Opp. Nitham, Moulana National Urdu University Road, Hyderabad - 032.
R3.VVS Varaprasad Rao S/o Uma Maheshwar Rao, Occ: Advocate (Driver of Car bearing No. TS 07 FW 8588),R/o Flat,No. 128, Lotus L&T Serene County, Gachi bowli, Opp. Nitham, Moulana National Urdu University Road, Hyderabad.... spondents

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **19-10-2022.at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)

**M/s. P. CHANDRA MOULI, SMT. ARUNDATHI,**
ADVOCATES,
H.NO. 8-1-58/5, BANGARU ENCLAVE, JYOTHINAGAR, KARMANGHAT, HYDERABAD

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-IV ADDL.METROPALITON MAGISTRATE MEDCHAL-MALKAJGIRI:AT:L.B.NAGAR.

O.S.NO.201 OF 2022

Between:
Thomala Narasimha Swamy & Others ...Plaintiffs

AND

1. The Tahsildar, Ghatkear Mandal, RR District.
2. All Concerned.

...Defendants

General Public are hereby informed that (1) Thomala Narasimha Swamy, S/o. Late T.Nammaiah, (2) Thomala Domodar, S/o. Late T.Nammaiah, (3) Thomala Ruknamma, W/o. Late T.Nammaiah, the above named plaintiffs have filed OS No.201/22 before the above mentioned Hon'ble Court seeking declaration of their status as legal heirs of the deceased T.Nammaiah. Who died on 14-07-2004 in respect of the property mentioned in the suit schedule held by the deceased person, and to pass other relief as deem fit and proper. If anybody has or have any objection for such declaration of the properties in the name of the plaintiffs by the Hon'ble Court, may appear before the Hon'ble Court on 04.11.2022 at 10.30 am either in person or through your advocate, or else the matter will be decided as per the records available before the Hon'ble Court.

// By order of the honourable court//

**M/S.A.RAVINDER, N.SHANKARAIAH & B.SAMATHA, Advocates**
H.No.14-51, P&T Colony, Dilsukhnagar, Hyderabad-500060
**Cell No.8919675740**
Counsel for the Plaintiffs



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తదితరులు

## వైభవంగా తిరుమలనాథ స్వామివారి రథోత్సవం

**పూడూరు, అక్టోబర్ 16, ప్రభాతవార్త** : పూడూరు మండలం పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో జరుగుతున్న శ్రీ తిరుమలనాథస్వామి ఉత్సవ (జాతర) కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజు ఆదివారం తిరుమలనాథ రథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ పీఠాధిపతులు వెంకటదాసులవారి అద్వర్యంలో జరిగిన శ్రీ స్వామివారి రథాన్ని లాగేందుకు వివిధ గ్రామాలనుండి వచ్చిన భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 5 గంటలకు ఆలయంనుండి ప్రారంభమైన స్వామివారి రథోత్సవం గ్రామంలో వీధివీధిన కలియ తిరుగుతూ మందగడ్డ వరకువెళ్లి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అడుగడుగున దండకాలు వేస్తూ, గుమ్మడికాయ, కొబ్బరికాయలు కొడుతూ, భజనలు, కోలాటాలు వేస్తూ స్వాగతం పలికారు. ఆలయంలో వసంతోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌పల్లి నాగభూషణంతోపాటు పలువురు వక్తలు పాల్గొని ప్రవచనాలను వినిపించారు. పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, డిసిసి అద్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, ఎంపిపి మల్లేశం, జడ్పిటిసి మేఘమాల ప్రభాకర్‌గుప్తా, స్థానిక సర్పంచ్ శ్రీధర్‌గుప్తాలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిషన్ పంతులు అద్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భజన మండలీలు పాల్గొని శ్రీ రాకంచెర్ల వెంకటదాసులవారి సంకీర్తనలు ఆలాపించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో పెద్దఉమ్మెంతాల్ గ్రామంఅంతా తిరుమలనాథ స్వామివారి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం స్వామివారి ఏకాంతసేవా, మానసపూజా కార్యక్రమాలతో ముగుస్తుందని నిర్వాహకులు తెలియజేశారు.

## సేవాతత్వం అలవర్చుకోవాలి

**స్వామి పూజనంద మహారాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి పూజనంద మహారాజ్

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 16,(ప్రభాతవార్త):** సమాజంలో ఇతరులకు సేవ చేసే తత్వాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని హైదరాబాద్ శ్రీ రామకృష్ణ మఠం సేవా సమితి సభ్యుడు స్వామి పూజనంద మహారాజ్ అన్నారు. ఆదివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో రామకృష్ణ మఠం వారి సహకారంతో నిర్మించిన రెండు గదులను దాత రేణుకాదేవితో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు. ప్రజల్లో దైవ భక్తి పెంపొందితే ఇతరులకు హాని చేసే భావాలు తొలగిపోతాయని అన్నారు. తోటి వ్యక్తులకు సహాయం చేయకపోయిన హాని మాత్రం చేయరాదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కవ శాతం దైవ భక్తి కలిగి ఉంటారని అన్నారు. గ్రామాల్లో గల దేవాలయాల్లో ప్రతి రోజు పూజలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమ్మరి భూపాలచారి, గ్రామస్తులు కృష్ణారెడ్డి, రాములుగౌడ్, నర్సింహులు, బాలరాజు, నరేష్, సుధాకర్, కుమార్, వెంకటయ్య, అచ్చం, శ్రీశైలం, మనోహార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ద్యావరి నరేందర్‌రెడ్డిని పరామర్శించిన ఎంఎల్‌సి



నరేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంఎల్‌సి మహేందర్‌రెడ్డి

**పెద్దేముల్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ప్రముఖ సినీ గేయ రచయిత, పెద్దేముల్ జడ్‌పిహెచ్‌ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ద్యావరి నరేందర్‌రెడ్డిని ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఇటివల రొడ్డు ప్రమాదానికి గురై కొలుకుంటున్న విషయము తెలుసుకొని ఆదివారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ఆయన నివాసానికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌సి వెంట పరామర్శించిన వారిలో పెద్దేముల్ ఎప్‌ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర ప్రతినిధి రొంపల్లి సంతోష్‌కుమార్, మంబాపూర్ యంపిటిసి వై.శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు పి.ప్రకాశం, బోయిని నారాయణ, దుగ్గాపూర్ శ్రీనివాస్, యువనాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, బాలు, దత్తు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌పార్టీలో చేరిన బిఆర్‌ఎస్ కార్యకర్తలు



కాంగ్రెస్‌పార్టీలో చేరిన కార్యకర్తలు

**బొంరాస్‌పేట్, అక్టోబర్16, ప్రభాతవార్త** : కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ తిరుపతిరెడ్డి అధ్వర్యంలో ఆదివారం నాడు బొంరాస్‌పేట్ మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడం జరిగిందని మండల అధ్యక్షులు నర్సిములు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మా ట్లాడుతూ ఎన్కెపల్లి గ్రామానికి చెందిన మసనురి వెంకటప్ప, దస్తప్పతోపాటు 10మంది కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరిగిందన్నారు. అనంతరం దుద్యాల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో పార్టీ నాయకులు ముని కుమార్ ఇటీవలే ఆకాల మరణం చెందిన విషయంను తెలుసు కున్న అయన వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.

# అతివృష్టి అణావృష్టి

- కురుస్తున్న వర్షాలు.. చేతికొచ్చిన పంటలు నష్టం
- పెట్టుబడులు రావంటున్న రైతన్నలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



పాడైన మొక్కజోన్న పంట

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 16,(ప్రభాతవార్త):** ఆరుకాలం కష్టపడి పంటలు సాగు చేసే రైతులకు ఎల్లప్పుడు కష్టాలే.. అతివృష్టి అణా వృష్టితో ప్రతి సంవత్సరం రైతులు ఇబ్బందులు పడుతూనే ఉం టారు. ప్రస్తుత సంవత్సరం వర్షాకాలం ప్రారంబదశలో కొన్ని రోజు లు వర్షాలు సరిగ్గా కురవక పంటసాగులో రైతులు ఇబ్బందులు పడ్డారు. తరువారత వర్షాలు కురవడం వల్లన రైతులు విత్తనాలు నాటుకున్నారు. పంటలు ఏపుగ పెరిగే సమయంలో వర్షాలు కురువకోపవడం వల్లన పంటలు సరిగ్గా పెరగలేదు. అడపదడప కురిసిన వర్షాలకు పొలాల్లో ఉన్న పంటలు ప్రస్తుతం కోత ధశకు చేరుకు న్నాయి. గత కొన్ని రోజుల నుంచి వర్షాలు కురువడం వల్లన చేతికొ చ్చిన పంటలు మొత్తం పాడైపోయే అవకాశం ఉందని రైతులు వాపో తున్నారు. వర్షాలు ఇలాగే కురిస్తే పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంది. పంటల సాగు ఇలా జిల్లెడు చౌదరిగూడ మం డలంలోని 24గ్రామ పంచాయితీలలో పూర్తి వ్యవసాయంపై అధా రపడి ఉంటారు. మండలంలో ప్రస్తుత సంవత్సరం 10వేల ఎకరా లలో పత్తి పంటసాగు చేశారు. 8వేల ఎకరాలలో వరి పంట, మొక్క జొన్న 8వేలు, కందులు వేయి ఎకరాలు, జొన్న 80ఎకరాలు, 100 ఎకరాలు ఇతర పంటలు సాగు చేసినట్లు అధికారులు తెలి పారు. మండలంలో సాగు చేసిన పంటలలో ప్రస్తుతం మొక్కజోన్న పంట కోత ధశలో ఉంది. వర్షాలు కురుస్తుండడం వల్లల పంట కోతలు ఇబ్బందిగా మారాయి.

**ప్రభుత్వం ఆదుకోవాలి**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో అతివృష్టి, అనావృష్టి కారణంగ నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తి స్థా యిలో ఆదుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. వేల రూ పాయల పెట్టుబడులు పెట్టిన పంటలో నష్టం వస్తే అప్పుల ఊబిలో మునిగిపోతామని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి

## వైద్య శిబిరంలో పాల్గొన్న సుధాకర్‌రెడ్డి

**వికారాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు అనంతగిరిపల్లి లో అమ్మ లాబ్స్, యజ్ఞ సంస్థ వారి ఆద్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిభిరం కాంగ్రెస్ నాయకులు రెడ్యానాయక్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో నిర్వహించారు. ఈ వైద్య శిభిరానికి ముఖ్యతిథిగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిభిరంలో ప్రజలకు రక్త పరీక్షలు, బీపీ, థైరాయిడ్, షుగర్ పరీక్షలు చేసి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ లాబ్స్ హాస్పిటల్ వారిని సుధాకర్‌రెడ్డి అభినందించారు. సుధాకర్ రెడ్డి సైతం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, ఎండీ. రహీం, విజయ్‌కుమార్, ఆనంద్, చంద్రశేఖర్, అనంతయ్య, లక్ష్మణ్, భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు

**షాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త** : నేటి విద్యార్థులే రేపటి భావి భారతీ పౌరులను ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీకాంత్, భాగ్యనగర్ కార్యదర్శి సూర్యప్రకాశ్‌లు తెలిపారు. షాబాద్‌లోని ఎంఎస్ గార్డెన్‌లో శంషాబాద్ విభాగ్ స్థాయి కలమంచ్ కార్యక్రమాన్ని శనివారం పొద్దుపోయే వరకు నిర్వహించారు. ఏడు నగరాల నుంచి దాదాపుగా 40 టీంల విద్యార్థిని, విద్యార్థినీలు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలపై పలు నృత్యాకళాలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులను దేశభక్తులుగా తయారు చేయడంతో ఏబీవీపీ ముందువరుసలో ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కలలను కూడా ప్రదర్శించాలని ఏబీవీపీ రాష్ట్రీయ కలమంచ్ పేరుతో విద్యార్థుల ముందుకు రావడం జరుగుతుందన్నారు. విద్యార్థులను దేశ భక్తులను తయారు చేయడంలో ఏబీవీపీ కీలక పాత్ర వహిస్తుందన్నారు. అనంతరం మంచి ప్రతిభ కనబర్చి ముందు వరుసలో నిలిచిన జట్టులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కలమంచ్ కోకన్వీనర్ మణికంఠ, రాష్ట్రవర్గ సభ్యులు ప్రదీప్, మహేష్, సాయి, భాను, ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, శివ, కార్తీక్, నందు, కుమార్, శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

## అధునాతన టెక్నాలజీతో మోకాళ్ల కీళ్ల మార్పిడి చికిత్స



వృద్ధుడికి మోకాళ్ల కీళ్ల మార్పిడి చికిత్స చేస్తున్న ఆస్పత్రి ఎండీ ప్రకాశ్

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 16, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని వజ్రా ఆస్పత్రిలో ఓ వృద్ధుడికి అరుదైన మోకాళ్ల కీళ్ల మార్పిడి చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి ఎండీ. డాక్టర్ జి. ప్రకాశ్ ఆదివారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని నారపల్లి వజ్రా ఆస్పత్రికి ఇటీవల యాదాద్రీ జిల్లా రాజాపేటకు చెందిన కె. రామనాథం ( 85 ) మోకాళ్ల కీళ్ల నొప్పితో ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. దీంతో ఆస్పత్రి డాక్టర్ ప్రకాశ్ వృద్ధుడికి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మోకాళ్ల కీళ్ల మార్పిడి శాస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ తర్వాత పేషంటు ఆరోగ్యవంతంగా ఉన్నట్లు తెలిపారు. మోకాళ్ల కీళ్ల ఆపరేషన్ విజయవంతం కావడంతో సుఖవంతంగా వృద్ధుడు నడువగల్గుతాడని డాక్టర్ తెలిపారు. నగర శివారులో గల తమ ఆస్పత్రిలో ఆధునాతన టెక్నాలజీతో నాణ్యమైన ఖరీదైన వైద్యాన్ని పేద ప్రజలకు తక్కువ ఖర్చుతోనే వైద్యసేవలు అందిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోకాళ్ల కీళ్ల మార్పిడి ఆపరేషన్‌లో ఆస్పత్రి ఎండీతో పాటు డాక్టర్లు పూస జగదీశ్, సుధాకర్ పాల్గొన్నట్లు తెలిపారు.

## ఆధ్యాత్మికతోనే మనసుకు ప్రశాంతత

**శంకర్‌పల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త** : ఆధ్యాత్మికతోనే మనసుకు ప్రశాంతత దొరుకుతుందని స్వర్గీయ మాజీ వైస్ ఎంపీపీ కుర్మ రాములమ్మ కుమారుడు టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుర్మ వెంకటేష్ తెలిపారు. ఆదివారం శంకర్‌పల్లి మండలంలోని అంతప్పగూడ గ్రామంలో రామాలయం నిర్మాణం కోసం రూ.1లక్ష11వేలు ఆలయ కమిటీ చైర్మెన్‌కు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ....ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. దైవమార్గంతో మనసుకు ప్రశాంతత దొరుకుతుందన్నారు. ఈకార్యక్రమంలో అంతప్పగూడ సర్పంచ్ దశరత్, మాజీ సర్పంచులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

**శంకర్‌పల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త** : ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు రావాలని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజునాయక్ తెలిపారు. ఆదివారం శంకర్‌పల్లి మండలంలోని అంతప్పగూడ గ్రామంలో రామాలయం నిర్మాణం కోసం రూ.15వేలు ఆలయ కమిటీ చైర్మెన్‌కు అందజేశారు. దైవచింతనతో మనస్సుకు ప్రశాంతత దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరు దైవమార్గంలో పయనించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

**శంషాబాద్ అక్టోబర్16, ప్రభాతవార్త** : దాదాపు 45 సంవత్సరాల తర్వాత కలిసిన విద్యార్థులు అనాటి తమ గురువులను సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. చిన్ననాటి స్నేహితులందరూ ఒకచోట కలిసి చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 45 సంవత్సరాల తర్వాత స్నేహితులు గురువులు ఒకచోట కలిసి తారతమ్యా భేదాలను విస్మరించి ఆడుతూ పాడుతూ...ఆనందంగా గడిపారు. ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం శంషాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎవరు ఊహించని విధంగా అనేక సంవత్సరాల తర్వాత ఒకచోట గుమిగూడి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంలో మునిగిపోయారు. ఆనాడు తమకు విద్యను నేర్పిన గురువులైన బాల ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, కిష్టాపర్, సద్గుణ రావు, జహంగీర్, షాజీదా బేగంలను విద్యార్థులు పూలమాలలు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సింగిల్ విండో మాజీ చైర్మన్ నంది బల్వంత్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది గూడ రఘవిర్ పండిత్, కొండా గణేష్ గౌడ్, సల్వేంద్రి ప్రభాకర్ రెడ్డి, పేద్దుల కుమార్ గౌడ్ ,గౌత వివేకానంద గుప్తా, సత్తిరెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్, నేత సంజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అలుగులు పారుతున్న చెన్నరాయుడు చెరువు

**కట్టమైసమ్మ ఆలయంలో పూజలు**



కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేసిన మాజీ సర్పంచు శ్రీనివాస్‌ముదిరాజ్, ముదిరాజ్‌సంఘం నాయకులు, మత్స్యకార సంఘం నాయకులు, సభ్యులు

**శామీర్‌పేట, అక్టోబరు 16, ప్రభాతవార్త**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దేవరయాంజాల్‌లోని చెన్నరాయుడు చెరువు ఎట్టకేలకు నిండి అలుగులు పారుతున్నాయి. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌లో చెన్నరాయుడు చెరువు నిండి అలుగులు వెళుతుండటంతో ఆ చెరువు కట్ట మైసమ్మ ఆలయంలో దేవరయాంజాల్ ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మ వారికి బోనం చేసి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ముదిరాజ్ సంఘం సభ్యులు, మత్స్యకార సంఘం సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరయాంజాల్ గ్రామ మాజీ సర్పంచు ఇ.శ్రీనివాస్‌ముదిరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జి.హరికృష్ణముదిరాజ్, మత్స్యకార సంఘం అధ్యక్షులు జి.బాలకృష్ణముదిరాజ్, సభ్యులు ఇ.రాజుముదిరాజ్, జి.ప్రదీప్‌ముదిరాజ్, ఇ.వెంకటేశముదిరాజ్, ఎం.వెంకటేశముదిరాజ్, బి.రమేశ్‌ముదిరాజ్, ఎం.గణేశ్‌ముదిరాజ్, జి.విజయ్‌ముదిరాజ్, లక్ష్మణ్‌ముదిరాజ్, ఆనంద్‌ముదిరాజ్, పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాసాని జ్ఞానేశ్వర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

**కొడంగల్ రూరల్, అక్టోబరు, 16 (ప్రభాతవార్త)**: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి బాలయ్య, యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు బి.వెంకటయ్య, ఆశన్న, భీములు, బోయిని హన్మంతు, శివరాజ్ తదితరులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలంటూ కాసాని జ్ఞానేశ్వర్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడంతో బీసీ కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని కోర్టు సూచించడం జరిగిందన్నారు. ముదిరాజ్‌ల హక్కుల కోసం కాసాని జ్ఞానేశ్వర్ కృషి చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు.



జిన్నింగ్‌మిల్ పూజలు చేస్తున్న మాధవిమదన్‌మోహన్ దంపతులు

## జిన్నింగ్ పరిశ్రమలో పూజలు

**అన్నదానం చేసిన బిజెపి నేత మదన్**

**నందిగామ, అక్టోబర్ 16, ప్రభాతవార్త** : నందిగామ మండల పరిధిలోని అయ్యప్పనగర్ పారిశ్రామిక వాడలో ఉన్న శ్రీ వెంకటరమణ ట్రేడర్స్, బిజెపి సీనియర్ నేత కుంచం మాధవి మదన్‌మోహన్ దంపతులు పరిశ్రమలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపావళి పర్వదినాలు, పత్తి సీజన్ ఆరంభమవుతున్న నేపథ్యంలో యాంత్రాలకు పూజలు చేశారు. అనంతరం పరిశ్రమ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ ఏడాది భారీ వర్షాల కారణంగా పత్తి చేళ్ల అన్నీ నీటమునిగి పత్తి రైతులు ఆగం అయ్యారని ఆశించిన స్థాయిలో పత్తి ఉత్పత్తులు తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడపదడప అక్కడక్కడ ఉన్న కొద్ది పాటి పత్తి చేళ్లను ఆ భగవంతుడే కాపాడాలని దేవునిపై భారం వేస్తున్నారు.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు

**ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి విజ్ఞప్తి**



పెద్దేముల్‌లో కూలిన ఇళ్లతో బాధితులు

**పెద్దేముల్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఇటివల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంట చేతి కొచ్చె దశలొ వర్షాలు కురియడంతో కాయలు నేల రాలుతున్నాయి. అంతెగాకుండా వర్షాలకు వరి పంట పిలకలు నేల రాలడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శనివారం కురిసిన భారీ వర్షానికి పెద్దేముల్ గ్రామానికి చెందిన ఎర్ర బిచ్చప్ప ఇళ్ళు కూలి పొయింది. దీంతో వర్షానికి ధాన్యముతో పాటు ఇంటి సామాను తడిసి పోయింది, కూలిన ఇంట్లోనే బిక్కుబిక్కు మంటుకాలం గడుపుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఎర్ర బిచ్చప్ప విజ్ఞప్తి చేస్తున్నాడు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**శామీర్‌పేట, అక్టోబరు 16, ప్రభాతవార్త**

కేశవరం గ్రామానికి చెందిన కొంపల్లి నవీన్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో ఉండి మృతిచెందటంతో తోటి స్నేహితులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి లక్ష రూపాయలు జమ చేసి ఆర్థిక సహాయంను (చెక్కును) అందజేసి ఆదుకున్నారు. ఆదివారం మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంను బాధిత కుటుంబానికి తోటి స్నేహితులుగ అండగ ఉంటూ అందజేశారు. 2001-2002 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరు కలిసి తోటి స్నేహితుడు కొంపల్లి నవీన్ అనారోగ్యంతో ఉండి మృతిచెందటంతో ఆర్థికంగ వారు ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో అతని స్నేహితులు వినేశ్, సూర్య ప్రకాశ్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, రాజు, పవన్‌కుమార్‌రెడ్డి, యూసుఫ్, ప్రవీణ్, నాగరాజు, పులి మహేశ్, పులి భాస్కర్, రమేశ్, బిక్షపతి, నర్సింలు, బ్రహ్మం, నరేశ్, లక్ష్మణ్, భూపాల్, మురళి, శేఖర్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన




వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్న నిర్వహకులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని గిర్వాణీ పాలీక్లీనిక్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. శిభిరంలో బిపి, మధుమేహం, థైరాయిడ్, సాధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. జనరల్ పిజిషియన్లు డాక్టర్ సి.శశాంఖ, డాక్టర్ ఎన్.గీతాశ్రీ, న్యూరోపిజిషియన్ డాక్టర్ వి.రఘురాం, గైనకాలజిస్ట్ డాక్టర్ హిమబిందులు విచ్చేసి రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. ఈసందర్భంగా దాదాపు 400 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్లు పలు సూచనలు చేశారు. గత 35 సంవత్సరాలుగా ఘట్‌కేసర్‌లో వైద్యసేవలు అందిస్తున్నామని గిర్వాణీ డయగ్నోస్టిక్, పాలిక్లీనిక్ నిర్వహకులు నామాల దేవానంద్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలు పేర్లు నమోదు చేసుకొని అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు పొందారు. భవిష్యత్తులో మరిన్ని శిభిరాలు నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**వికారాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వికారాబాద్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా బాల్ కిషన్, మండల అధ్యక్షులుగా రాఘవేందర్ గుప్త, మండల ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, మండల కోశాధికారిగా, శ్రీనివాస్ రెడ్డి, మహిళా కార్యదర్శిగా జ్యోతి, మండల ఉపాధ్యక్షులుగా ఓ.రమేష్, అంబిక, లక్ష్మీదుర్గ, యాదమ్మ, సుందరమ్మ, సహాయ కార్యదర్శిగా దివాకర్, మీడియా కన్వీనర్ గా పండరి, మండల కార్యవర్గ సభ్యులు పద్మనాభ స్వామి, భారతమ్మ, ప్రణిత, విజయనిర్మల, మౌనిక జిల్లా కార్యవర్గ సభ్యులుగా రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హన్మయ్య, రమాదేవి, వసుందర, స్వప్న ఉమా రాణి, రాధలువివిధ బాధ్యతలలో నియామకం చేయ డం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్తగడి అంజిరెడ్డి, మహేంద్ర బహదూర్, జిల్లా కోశాధికారి లక్ష్మయ్య, ఎన్నికల అధికారులు అనంత రెడ్డి, కమాల్‌రెడ్డి, ఉపాధ్యయులు శ్రీలత రెడ్డి, మల్లేశం స్వామి ప్రసాద్‌కుమార్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలి

**కొడంగల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త** సమాజంలో ప్రతి ఒక్కరు ధర్మాన్ని పాటిస్తు ఆద్యాత్మికత, దైవ చింతన కలిగి ఉండాలని పాటిమీదిపల్లి రుద్రారం వారణాసి ఆది మఠం డాక్టర్ శ్రీ రాచోటీశ్వర శివాచార్య మహాస్వామి అన్నారు. మండల పరిధిలోని పాటిమీదిపల్లి గ్రామంలోని శివాలయం ఆవరణలో గత 22 రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ప్రవచనాలు అందించారు. నిర్మలమైన మనస్సుతో భగవంతుడిని భక్తితో ఆరాధిస్తే శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని అన్నారు. స్వంత బంధానికి, మోక్షానికి మనస్సే కారణమవుతుందని, చంచలమైన మనస్సును భక్తితో జయించాలని అన్నారు. ఆధ్యాత్మికత వల్ల ప్రతి వ్యక్తి సమాజంలో సభ్యతగా మెలిగే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. అంతేగాక ధర్మజాగరణతో నడుచుకుంటూ చెడు వ్యసనాలు, అలవాట్లను మానుకోవాలని సూచించారు.

గ్రామంలోని శివాలయంలో గత 22 రోజులుగా ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించారు. మొదటి 11 రోజులు శివనామ స్మరణతో సప్త భజనలలో భాగంగా 20కి పైగా భజన మండలి బృంధాలు నిర్విరామంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్. గురునాధ్‌రెడ్డి, మున్సిపల్ చెర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రేస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుములు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.